

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మా ఊరిలో పరిశ్రమలు వద్దు

● కుడితిని రైతుల ఆగ్రహం ● రోడ్డుపై బైఠాయించి నిరసన 8

నటి సరోజాదేవి పేరిట అభినయ సరస్వతి పురస్కారం

● రూ.లక్ష నగదు.. 100 గ్రాముల బంగారం షీల్డ్‌తో సత్కారం ● ఆదేశాలు జారీ చేసిన కన్నడ సాంస్కృతిక శాఖ



పంచభాషా నటి, స్వర్గీయ బి.సరోజాదేవి పేరిట 'అభినయ సరస్వతి' పురస్కారాన్ని ఏర్పాటు చేశామని కన్నడ సాంస్కృతి శాఖ తెలిపింది. ఇటీవల పలువురు నటులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కోరారు. అందుకు అనుగుణంగా బుధవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

(వివరాలు మెయిన్‌లో..)



స్వచ్ఛతా అభియానలో మాజీ సీఎం యడియూరప్ప

వాడవాడలా మోదీ జన్మదిన వేడుకలు 7

అంతా మట్టే..!





● జలాశయాలకు సవాల్‌గా మారిన పూడిక సమస్య ● భారీ ప్రాజెక్టుల్లో మరింత తీవ్రం



● తగ్గుతున్న నీటి నిల్వలు ● సాగుకు తీవ్ర నష్టం ● తొలగించాలంటే భారీ నిధులు తప్పనిసరి

బెంగళూరు, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సవాల్‌గా మారుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్రారంభంలో పలు జలాశయాల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఓ దశాబ్ద కాలంపాటు నిర్మాణాలు జరిగిన ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే రాష్ట్రంలో భారీ ప్రాజెక్టులు నిర్మాణం జరిగి అరశతాబ్దం దాటిపోయింది. ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామని బడ్జెట్‌లో వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని గొప్పలు చెబుతున్నారు. అయితే రెండున్నర దశాబ్దాలలో రాష్ట్రంలో నిర్మించిన ముఖ్యమైన జలాశయం ఒకటి కూడా లేదు. ఆల్మట్టి ప్రాజెక్టును 519 మీటర్ల నుంచి 524 మీటర్లకు పెంచాలనే ప్రతిపాదన దశాబ్దాలకాలంగా సాగుతోంది. మహారాష్ట్రలో ఉద్భవించే కృష్ణ నది జలాలకోసం విజయపుర జిల్లాలో ఆల్మట్టి జలాశయం ఉంది. కృష్ణ నది నీరు మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వాటా ఉంది. సుదీర్ఘ కాలం తర్వాత ఎత్తు పెంచుకునేందుకు ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. అయితే కేవలం ట్రిబ్యునల్ తీర్పుతోనే నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉండదు. కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ జారీ చేయాల్సి ఉంది. ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఓ అడుగు ముందుకేసి ముంపునకు గురయ్యే భూమికి పరిహారాన్ని తాజాగా మంత్రివర్గ సమావేశంలో ప్రకటించారు. ప్రాజెక్టువ్యయం, పరిహారం పెరగడంతో కొన్నేళ్లపాటు గ్రాంట్లు కేటాయించాల్సి వస్తుంది. రాష్ట్రంలోని కీలక జలాశయాలలో పూడిక చేరి నీటి పరిమాణం నిల్వ గణనీయంగా తగ్గుతూ వస్తోంది.


వేధిస్తున్న నిధుల సమస్య

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పూడిక ప్రమాణాన్ని గుర్తించేందుకు జలవనరుల నిపుణులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వారు సమర్పించిన నివేదికల తర్వాత పరిష్కార చర్యలపట్ల కూడా నిర్లక్ష్య ధోరణి తలెత్తుతోందని, దాని ప్రభావమే 11 జలాశయాల పరిస్థితికి నిదర్శనమని తెలుస్తోంది. తుంగభద్ర జలాశయం విషయంలో కేంద్రప్రభుత్వ ఆర్థికసాయం కోరుతూ లేఖ రాశారు. ప్రత్యామ్నాయ పరిష్కారంగా నవలి వద్ద తుంగభద్రకు సమాంతరంగా జలాశయం నిర్మాణాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అనుమతులకోసం ప్రయత్నిస్తున్నారు. కేంద్ర ప్రధానమంత్రి కృషి సించయ్, ప్రతి పొలానికి నీరు, మరమ్మతు, ఆధునికత, పునరుద్ధరణ పథకాలకింద రూ.13,695 కోట్లు సాయం కోరారు. ఈ మొత్తంలో తుంగభద్ర జలాశయం నుంచి 26.68 టీఎంసీల పూడిక తీసేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రస్తావన పరిగణించాలని 2024 ఆగస్టులో కేంద్రప్రభుత్వానికి మరోసారి లేఖ పంపారు. ఒక టీఎంసీ అడుగుల మేర పూడికను తొలగించేందుకు కనీసం వెయ్యి ట్రాక్టర్లు అవసరం. తీసిన పూడికను ఒక అడుగు ఎత్తుతో వేయాలంటే 6 లక్షల ఎకరాల భూమి అవసరంగా ఉంది. ఇది ఆర్థిక, సాంకేతికపరంగా సాధ్యంకాని ప్రక్రియ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జలాశయం	నీటి సామర్థ్యం (టీఎంసీలు)	పూడిక ప్రమాణం (టీఎంసీలు)
తుంగభద్ర	100.856	31.617
మలప్రభ	36.730	1.089
భద్ర	70.776	0.767
ఘటప్రభ	45.664	4.982
ఆల్మట్టి	115.552	7.556
హిప్పరగి	96.168	0.126
బసవసాగర	27.792	10.550
కేఆర్ఎస్	47.428	2.024
కబిని	18.476	1.040
హారంగి	7.264	1.236
హేమావతి	34.414	2.089
వాణివిలాస్	24.997	0.582

తుంగభద్ర జలాశయం ప్రదేశంలో ముందుభాగంలో కాకుండా వెనుకభాగం నుంచి పూడికను తీయాలనే ఆలోచన కూడా ఉంది. మిగిలిన జలాశయాలకు సంబంధించి జల వనరులశాఖ ఏ విధమైన చర్యలకు కనీసమైన చర్చలు కూడా జరపలేదనే విమర్శలు ఉన్నాయి. కాగా 22 ప్రధాన జలాశయాలలో 2023 సెప్టెంబరు 14నాటికి 307.754 టీఎంసీలు కాగా 57.75శాతం నీరు ఉండేది. 2024 సెప్టెంబరు 14 నాటికి 462.191 టీఎంసీలు కాగా 86.73 శాతం నీరు ఉండేది. 2025 సెప్టెంబరు 14 నాటికి 444.287 టీఎంసీలు కాగా 83.47శాతం ఉన్నట్లు ప్రకటించారు.

అత్యధికంగా ఆల్మట్టిలోనే..



ప్రాజెక్టుల పరిస్థితి, గేట్ల సామర్థ్యంకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం పలు కమిటీలను ఏర్పాటు చేసింది. గత ఏడాది తుంగభద్ర జలాశయానికి అనుబంధంగా ఉండే ఓ గేటు మరమ్మతులకు నోచుకోవడంతో భారీగా నిల్వనీరు వృథా అయిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల పరిస్థితిపై జలవనరుల విభాగంలో నిపుణులచే విభాగాలవారీగా పరిశీలన జరిపించారు. జలవనరుల నిపుణుల నివేదిక బెంబేలెత్తించే పరిస్థితి ఏర్పడింది. 12 జలాశయాలలో పూడికకు సంబంధించి నివేదికను వెల్లడించారు. జాతీయ సరాసరి నీటి సేకరణ సామర్థ్యంలో 3శాతం పూడికకు అవకాశం ఉంది. తుంగభద్ర జలాశయం మినహా మిగిలిన జలాశయాలలో 2శాతానికి అటుఇటుగా పూడిక ఉంది. అయితే ఏటా జలాశయాలకు వస్తున్న వరదనీటిని పరిశీలిస్తే మరో పదేళ్లలో అన్ని జలాశయాలలో పూడిక ప్రమాదస్థాయిని మించనుందని నిపుణులు తెలిపారు. జల విజ్ఞాన నిపుణుల సర్వే ప్రకారం 12 జలాశయాలపైకి హారంగి డ్యాంలో పూడికతీత పనులు చేపట్టారు. అది కూడా నాలుగేళ్లపాటు నత్తనడకన సాగింది. హారంగి డ్యాం నదీపరీవాహక ప్రదేశం, పునరుద్ధరణ, సంరక్షణకింద 1.235 టీఎంసీ అడుగుల పూడిక పైకి 0.031 మేర పూడిక తొలగించేందుకు 130 కోట్ల రూపాయలు అంచనా వేశారు. రాష్ట్రంలో ఏకైక భారీ జలాశయంగా పేరొందిన ఆల్మట్టి జలాశయంలో 8 టీఎంసీల మేర పూడిక చేరిందని అంచనా వేశారు. కేవలం 25 ఏళ్ల వ్యవధిలోనే అంతమేర పూడిక చేరినట్టయ్యింది. తుంగభద్ర జలాశయం 2008కి ముందు ఏడాదికి సరాసరి 0.40 టీఎంసీల అడుగుల మేర పూడిక వచ్చి చేరింది. ఆ తర్వాత ఏటా ఒక టీఎంసీ అడుగు మేర పెరుగుతూ వచ్చింది.

కలబురగిలో పీఎం మిత్ర పార్క్

● మధ్యప్రదేశ్ నుంచి ప్రధాని శంకుస్థాపన

బెంగళూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లాలో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ రూపంలో శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ వసంతంలోకి అడుగిట్టిన సందర్భంలో బుధవారం స్వస్థనారీ, సశక్త పరివార, జాతీయ పోషణ్ మాసోత్సవ్ అభియానకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం శ్రీకారం చుట్టారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా నుంచి మధ్యప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర పరిధి నుంచి ఏడునగరాలలో ప్రపంచస్థాయి మౌలికసదుపాయాలతో టెక్స్‌టైల్ పార్కులు స్థాపించేందుకు 'పీఎం మిత్ర' పథకాన్ని ప్రారంభించారు. కలబురగి జిల్లా పరిధిలోను భారీ టెక్స్‌టైల్ పార్కుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు.

కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● మహనీయుల త్యాగాలతోనే ఈ ప్రాంతానికి విముక్తి: విమోచన దినోత్సవంలో సీఎం సిద్దరామయ్య



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం



పటేల్ విగ్రహం వద్ద స్థానిక నాయకులతో..

బళ్లారి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, స్వాతంత్ర్యం పోరాటంతో పాటు హైదరాబాద్ కర్ణాటక విమోచన కోసం, హైదరాబాద్ కర్నాటక భాగాన్ని భారత దేశంలో విలీనం కోసం పోరాడిన మహనీయుల త్యాగఫలితమే నేడు కళ్యాణ కర్ణాటక విమోచన దినోత్సవం జరుపుకుంటున్నామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. హైదరాబాద్ కర్ణాటక విమోచన దినోత్సవంలో భాగంగా బుధవారం గుల్బర్గాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ కర్ణాటక సాహిత్య కళ, సంస్కృతి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణ తదితర రంగాల్లో దేశానికే వెలుగు తెచ్చిపెట్టిన మహనీయులను మరువరాదన్నారు. విశ్వగురు సాంస్కృతిక నాయకులు బసవణ్ణ నేతృత్వంలో శరణలు చళువలి ఇదే పుణ్యభూమిలో ప్రారంభం కావడం హర్షించదగ్గ విషయమన్నారు. స్వతంత్ర భారత దేశం అభివృద్ధి వైపు నడుస్తుండగా, కళ్యాణ కర్ణాటక జిల్లాలో అభివృద్ధి కుంటుపడి అంధకారంలో నిలిచి ఉన్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ ధరమ్‌సింగ్ నేతృత్వంలో 1990లో హైదరాబాద్ కర్ణాటక అభివృద్ధి మండలి ఏర్పాటుతో ఈ భాగంలో అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపుతో ముందడుగు వేసినట్లు అయిందన్నారు. హైదరాబాద్ కర్ణాటక ప్రాంతానికి ప్రత్యేక హోదా కల్పించడంలో కృషి చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ధరమ్ సింగ్, మల్లికార్జున ఖర్గే సేవలు మరువలేనివని అభివర్ణించారు. హైదరాబాద్ కర్ణాటక ప్రాంతాన్ని ప్రస్తుతం కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలిగా మారిన తరువాత 2013-15 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు ప్రభుత్వం నుంచి 24,780 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసినట్లు, ఇప్పటి వరకు రూ.14వేల కోట్ల రూపాయల కంటే ఎక్కువగా ఖర్చుచేయగా, 41,103 పనులు చేపట్టగా 32,985 పనులు పూర్తి చేసినట్లు తెలలిపారు. 8,118 పనులు వివిధ స్థాయిలో నడుస్తున్నట్లు వివరించారు. కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 5వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు, రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన మాట నిలుపుకున్నట్లు, బోర్డు అధ్యక్షుడు డాక్టర్ అజయ్ ధర్మసింగ్ అధ్యక్షతన మండలి సిద్ధం చేసినట్లు క్రియా యోజనకు ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 371(జె) హోదా కల్పించడంలో ఈ భాగం విద్యార్థులకు ఉన్నత స్థాయి చదువులు అందరికి అవకాశాలు దక్కుతున్నాయని అభిప్రాయ పడ్డారు. 371 వచ్చిన తరువాత 2014-15 నుండి 2024 వరకు ఈ భాగంలోని 10వేల మంది విద్యార్థులకు మెడికల్, 31వేల మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలు లభించడం హర్షించదగ్గ విషయన్నారు. ఇదే సందర్భంలో కళ్యాణ కర్నాటక పరిధిలో వచ్చే అన్ని జిల్లాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమం అనంతరం గుల్బర్గా జిల్లాలో అధిక వర్షాల కారణంగా నష్టపోయిన పంట పొలాలను అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే, కెకెఆర్‌డిబి అధ్యక్షులు అజయ్ సింగ్, ఎమ్మెల్యే అల్లమ ప్రభు పాటీల్‌లతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీవారి వార్షిక పవిత్రోత్సవాలు

బెంగళూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వయ్యాలికావల్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం యాగశాల వైదిక కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్ర పవిత్ర ప్రతిష్ట కార్యక్రమాలు కొనసాగాయి. ఊంజల్ సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. శుక్రవారం వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సహాయ కార్యనిర్వహణాధికారి బాలరాజు, సూపరింటెండెంట్ జయంతి తదితరులు పర్యవేక్షించారు.



శ్రీవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న పండితులు

అత్యాచార ఆరోపణల్లో ఎమ్మెల్యేకు రిలీఫ్

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అత్యాచార ఆరోపణల కేసులో రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నకు బిగ్ రిలీఫ్ లభించింది. మునిరత్న సహా నలుగురిపై సిట్ ప్రత్యేక కోర్టుకు బి-రిపోర్టు సమర్పించారు. దీనికి సంబంధించిన కేసును హైకోర్టు రద్దు చేసింది. ఆర్ఎంసీ యార్డు పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మునిరత్న హైకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి ఎంఐ అరుణ్ ఏకసభ్య ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ కేసులో మునిరత్న సహా నలుగురిపై సిట్ ప్రత్యేక కోర్టుకు బీ-రిపోర్టును పరిగణించిన న్యాయస్థానం సదరు కేసును కొట్టివేస్తున్నట్లు తీర్పు ప్రకటించింది. కేసులో ఎమ్మెల్యే మునిరత్న, వసంతకుమార్, చన్నకేశవ, కమల్‌లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. కేసు పూర్వాపరాలు ఇలా. అత్యాచారం జరిగిందంటూ మే 20న 40ఏళ్ల మహిళ ఆర్ఎంసీ యార్డు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 2023 జూన్ 11న ఎమ్మెల్యే సహచరుల ఎదుట తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. ఆత్మహత్యకు ప్రయత్నించి ఆసుపత్రి పాలైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈకేసును సిట్ దర్యాప్తు చేయగా తాజాగా తీర్పు వెలువడింది.

అరచేతిలో ప్రాణాలు

● వీల్ చెయిర్ లేక చేతుల మీదే వృద్ధురాలి తరలింపు ● బెళవావి ఆస్పత్రి దృశ్యాలపై సర్వత్రా ఆగ్రహం



వృద్ధురాలిని చేతులపై తీసుకెళ్తున్న బంధువులు

బెంగళూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రోగులు నడవలేని స్థితిలో ఆసపత్రుల్లో వీల్‌చెయిర్, స్ట్రెచర్‌లో కానీ తరలించడం తెలిసిందే. కొన్ని రాష్ట్రంలోని కొన్ని ఆస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించడానికి తీవ్ర ఇబ్బంది పడుతుంటారు. బెళగావిలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉండే ఆసుపత్రిలోనే ఇటువంటి పరిస్థితి కొనసాగింది. మంగళవారం వైద్యంకోసం ఓ వృద్ధురాలిని బంధువులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వీల్‌చెయిర్ లేకపోవడంతో ఓపీడీ విభాగంలో ఉండే డాక్టర్ వద్దకు వృద్ధురాలి వెంట వచ్చిన ఓ మహిళతోపాటు మరో వ్యక్తి చేతుల మీదే తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియోలు బుధవారం వెలుగులోకి వైరల్ అయ్యాయి. ఆస్పత్రిలో సౌకర్యాల లేమిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాత ఓటరు జాబితాలకు గుడ్‌బై

● రాష్ట్ర వ్యాప్తంగా కొత్తవే


- పౌరసత్వ గుర్తింపు కోసమే ఎస్ఐఆర్ విధానం
- 1987 తర్వాత జన్మించిన వారికి రికార్డులు తప్పనిసరి
- ప్రతి ఓటరుకు రెండు దరఖాస్తులు అందజేస్తాం
- రెండు చోట్ల ఓటు ఉంటే తొలగిస్తాం
- రాష్ట్ర ఎన్నికల అధికారి అన్బుక్ కుమార్



బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పాత ఓటరు జాబితాలకు కాలం చెల్లిందని, వాటి స్థానంలో కొత్త జాబితాలు రానున్నాయని, దేశ వ్యాప్తంగా ఎన్నికల కమిషన్ జరుపుతున్న స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఓటరు జాబితా సమగ్ర సవరణ) విధానం ద్వారా పౌరసత్వం గుర్తింపుతో పాటు సమగ్ర వివరాలు సేకరిస్తున్నామని, త్వరలోనే కర్ణాటకలోనూ అమలు చేస్తామని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి అన్బుక్ కుమార్ తెలిపారు. బుధవారం ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ విధానానికి సంబంధించి మీడియాకు అవగాహనా సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా సవరణకు ఒకేసారి నోటిఫికేషన్ విడుదలయ్యిందన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు అమలు చేసేది త్వరలోనే షెడ్యూలు ప్రకటిస్తామన్నారు. ఇన్‌టెన్సివ్ రివిజన్ జరుపడం ఇదేం తొలిసారి కాదన్నారు. 2002లోనూ ప్రక్రియ జరిగిందన్నారు. ప్రస్తుతం సమగ్ర వివరాలు సేకరించేందుకు కమిషన్ సిద్ధం అయ్యిందన్నారు. 1987కు ముందు జన్మించిన వారికి ఎటువంటి వివరాలు తీసుకునేది ఉండదన్నారు. కానీ ఆ తర్వాత జన్మించిన వారు ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు ఆధార్ కార్డును తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. వారి తండ్రికి సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఒకే వ్యక్తికి రెండు ప్రదేశాలలో ఓట్లు ఉంటే సమగ్ర సవరణ ద్వారా కట్టడి చేసినట్లు అవుతుందన్నారు. ఫొటో గుర్తింపు ద్వారా కానీ వివరాల ద్వారా పరిశీలించి తొలగిస్తామన్నారు. రాష్ట్రంలోని సుమారు 5.5

ఇంటివద్దకే దరఖాస్తులు

కోట్ల మంది ఓటర్లు ఉన్నారని వారందరికీ అనుబంధంగా 11కోట్ల ప్రత్యేక దరఖాస్తులు సిద్ధం చేశామన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు సంబంధించిన అధికారి ప్రతి ఇంటికి వెళ్లి రెండు దరఖాస్తులను అందిస్తారన్నారు. దరఖాస్తులో పొందుపరచిన వివరాలను భర్తీ చేసి అవసరమైన రికార్డులు జతచేసి దరఖాస్తు బీఎల్‌ఓలకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక వేళ స్థానికంగా అందుబాటులో లేనివారు క్యూఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు భర్తీ చేసి సమర్పించేందుకు వీలుంటుందన్నారు. దరఖాస్తుల్లో ఒక దానిని బీఎల్‌ఓ సంతకం చేసి ఓటరుకు వాపసు చేస్తారన్నారు. 2002లో జరిపిన సర్వేలో సమగ్ర వివరాలు సేకరించనందున ప్రస్తుతం అన్ని వివరాలు కోరుతున్నామన్నారు. 2002, 2025కు సంబంధించిన ఓటరు జాబితాలను వెబ్‌లో ఉంచామన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైతే ఇప్పటి దాకా ఉండే ఓటరు జాబితా పూర్తిగా రద్దు చేసినట్లు అవుతుందని కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న తర్వాతే ఓటరు జాబితా స్పష్టత వస్తుందన్నారు. సమగ్ర సవరణ ప్రక్రియ జరిగే వేళ కొత్తగా పేర్ల నమోదు, చేర్పులు మార్పులకు అవకాశం ఉండదన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉండే పదివేలకు పైగా దరఖాస్తులను క్లియర్ చేయాలని నిర్ణయించామన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ఓరకంగా దేశంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఎంతటి ప్రాధాన్యమో అదే విధంగా పౌరసత్వ నిరూపణ కూడా అనేలా అమలు చేస్తున్నారు. ఇకపై ప్రతి పోలింగ్ బూత్‌కు గరిష్ఠంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉంటారన్నారు. జిల్లాలు, డివిజన్‌ల వారీగా అధికారులకు శిక్షణ ఇచ్చామని, ప్రస్తుతం బీఎల్‌ఓలకు శిక్షణాతరగతులు కొనసాగుతున్నాయని ఈనెల 25లోగా ప్రక్రియ ముగుస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలే అత్యధికంగా బీఎల్‌ఓలుగా ఉన్నారని గతంలో వారికి గౌరవ వేతనంగా ఆరువేలు ఇచ్చేవారని ప్రస్తుతం రెట్టింపు చేశామని సవరణ ప్రక్రియ కోసం అదనంగా మరో ఆరువేలు కలిపి రూ.18వేలు చెల్లిస్తామన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ మూడునెలలపాటు జరుగుతుందన్నారు. త్వరలోనే షెడ్యూల్ విడుదలవుతుందన్నారు.







పురుగు మందు డ్రోన్‌లో పోస్తున్న రైతు

డ్రోన్‌ఇజం..!

వ్యవసాయంలో సాంకేతిక విప్లవం.. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ

వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అధునాతన వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అందజేస్తోంది. ఈక్రమంలోనే పురుగు మందులు పిచికారీ చేయడానికి సబ్సిడీపై డ్రోన్‌లు అందజేసింది. వీటి ద్వారా రైతులు తక్కువ సమయంలో ఎక్కువ పంటకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఒక్క కిసాన్ డ్రోన్ యూనిట్ పూర్తి ధర రూ. 9.8 లక్షలు కాగా రైతు వాటా రూ. 1.96 లక్షలు చెల్లిస్తే మిగిలిన రూ. 7.84 లక్షలు ప్రభుత్వమే భరిస్తుంది. డ్రోన్ ట్యాంకు 12 లీటర్ల నీటి సామర్థ్యం కలిగి ఉంటుంది. విద్యుత్ చార్జింగ్ ద్వారా డ్రోన్ పని చేస్తుంది 40 నుంచి 60 నిమిషాల లోపు డ్రోన్ చార్జింగ్ ఫుల్ అవుతుంది.

- ఆంధ్రజ్యోతి, రాప్తాడు

ఎకరా పొలానికి మందు పిచికారీ చేసినందుకు ఒక ట్యాంకు నీరు (12 లీటర్ల నీరు, పురుగు మందు) అవసరం. ఎకరాకు పురుగు మందు పిచికారీ చేసినందుకు రైతుల నుంచి రూ. 500 తీసుకుంటున్నారు. కిసాన్ డ్రోన్ ట్యాంకు 12 లీటర్ల నీటి సామర్థ్యం కలిగి ఉంటుంది. 12 లీటర్ల నీటిలో పురుగు మందు కలిసి ఒక ఎకరా వరికి 5 నిమిషాల్లోనే మందు పిచికారీ చేయవచ్చు. కిసాన్ డ్రోన్ ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశం తీసుకెళ్లేందుకు ప్రత్యేక స్టాండ్ అమర్చిన ద్విచక్రవాహనం లేదా ఆటో ఉపయోగిస్తున్నారు.

ఎకరాకు రూ. 500

రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలోని అన్నదాత రైతు సేవా సంఘంలోని ఐదుగురు సభ్యులు కలిసి కిసాన్ డ్రోన్ తీసుకున్నారు. రెండు నెలల కిందట రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఏఓ కృష్ణ చైతన్య కిసాన్ డ్రోన్‌ను అన్నదాత రైతు సేవా సంఘం సభ్యులకు అందచేశారు. సంఘం సభ్యులు

డ్రోన్ ఆపరేటర్‌గా ఉపాధి

కిసాన్ డ్రోన్ ఆపరేటర్, కో ఆపరేటర్‌ను నియమించి రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని దానిమ్మ, అరటి, చీనీ, వరి, వేరుశనగ, మామిడి వంటి అనేక రకాల పంటలకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ట్రాక్టర్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు కంటే కిసాన్ డ్రోన్ ద్వారా వేగంగా, సులభంగా మందులు పిచికారీ చేయవచ్చు. చదువుకుని ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న యువకులు డ్రోన్ ఆపరేటర్‌గా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

5 నిమిషాల్లోనే ఎకరా పొలానికి..

- రైతులకు వరంగా మారిన కిసాన్ డ్రోన్
- భారీ సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

వేగంగా, సులభంగా..

ఈ ఏడాది రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. ప్రతిఏటా వరికి తైవాన్ స్ప్రేయర్ ద్వారా మందు పిచికారీ చేయాలంటే చాలా కష్టంగా ఉండేది. మోకాలు లోతు బురద మడిలో నడిచి మందు పిచికారీ చేయాలంటే కూలీలు రారు. ఈ ఏడాది కిసాన్ డ్రోన్ అందుబాటులో ఉండటంతో రెండు ఎకరాలకు రెండు ట్యాంకులు మందు పిచికారి చేయించా. పది నిమిషాల్లో పని పూర్తయింది. డ్రోన్ వలన వేగంగా, సులభంగా పూర్తయింది. రెండు ట్యాంకులు మందు పిచికారి చేసినందుకు రూ. వెయ్యి చెల్లించా.



- హరినాథ్‌రెడ్డి, రైతు, ఎం. చెర్లోపల్లి

మండలానికి ఒకటి

పురుగు మందులు సులభంగా, వేగంగా తక్కువ ఖర్చుతో పిచికారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అధిక శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్ అందజేస్తోంది. ప్రస్తుతానికి మండలానికి ఒకటి చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తోంది. అన్ని రకాల పంటలకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

- కృష్ణ చైతన్య, ఏఓ, రాప్తాడు

అగ్రికల్చర్ డిప్లొమా చేశా



హంపాపురం ఆదరణ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్ పూర్తి చేశా. ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నా. గుంటూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 10 రోజులు శిక్షణ తీసుకుని ప్రభుత్వ సర్టిఫికెట్ పొందా. ప్రస్తుతం డ్రోన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నా. ఇప్పటి వరకూ 100 ట్యాంకులకు పైగా మందు పిచికారీ చేశా. సంఘం సభ్యులు నాకు నెలకు రూ.15వేలు, సహాయకుడికి రూ.10వేలు జీతం చెల్లిస్తున్నారు.

- వినయ్‌కుమార్ డ్రోన్ ఆపరేటర్, హంపాపురం

అర్చకుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- దేవదాయ శాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి



మాట్లాడుతున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని దేవదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో అర్చక సమావేశం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు నేతృత్వంలో అర్చకులు తమ సమస్యలను సహాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ధూపదీప నైవేద్య పథకం, ఉపనయనం, డెత్ గ్రాట్యుటీ, 43 రిజిస్ట్రేషన్, అర్చకులకు పంట నష్ట పరిహారం, వాతావరణ బీమా తదితర పథకాలు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే తల్లికి వందనం పథకం అర్చక కుటుంబాలకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. వీటన్నింటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి మాట్లాడుతూ.. అర్చక కుటుంబాలకు సంక్షేమ పథకాల వర్తింపు తమ పరిధిలో ఉండదన్నారు. ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్చకుల సమస్యలను ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఈఓలు తమ పరిధిల్లోని ఆలయాల్లో సమస్యలపై దృష్టి సారించేలా సూచనలిస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు సీతారామశర్మ, ప్రసాద్, కందుకూరు రామాంజనేయులు, పలుకూరు రవికుమార్, మారుతీప్రసాద్, వెంకటగిరయ్య, తిరుపతయ్య, చంద్రమౌళి, విజయ్‌కుమార్, రాజన్న, మల్లికార్జున, వేణుగోపాలస్వామి, రమణ, భార్గవ, నందాచార్యులు, నవీన్, చేతన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 480 మార్కులకుపైగా, ప్రైవేటు స్కూళ్లలో 520కిపైగా సాధించినవారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో 850, ప్రైవేటు కాలేజీల్లో 900 మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ప్రతులను ఎం. శ్రీనివాసులు ఆర్టీసీ, డోర్ నం. 18-1-406, వేణుగోపాల్ నగర్, అనంతపురం చిరునామాకు పంపాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు అక్టోబరు 19వ తేదీన జీసెస్‌నగర్‌లోని జయమనెమ్మ కల్యాణమండపంలో పురస్కారాలు అందజేస్తామన్నారు. వివరాలకు 9441222874 నంబరులో సంప్రదించాలన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

అనంతపురంరూరల్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో గల ఎస్ఎల్ఎస్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 19వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల సీఈఓ వెంకటరామిరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ కంప్యూటర్స్ 2023, 2024, 2025 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చన్నారు. ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆయా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9440469476 నంబరులో సంప్రదించాలన్నారు.

మీ ఫొటోకు ఓ దండం!

- స్మార్ట్ రైస్ కార్డు పంపిణీలో చోటానాయకుల ఫొటో షూట్
- తలలు పట్టుకుంటున్న రేషన్‌షాపు డీలర్లు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీకి ఫొటో షూట్ ప్రతిబంధకంగా మారుతోంది. అధికారపార్టీకి చెందిన కొందరు చోటా నాయకులు కార్డుల పంపిణీ కార్యక్రమంలో తాముండాలంటూ షో చేస్తుండటమే ఇబ్బందులకు కారణమవు తున్నట్లు సమాచారం. ఈక్రమంలో రేషన్‌కార్డుదారులను ఒక చోట చేర్చడానికి, ఫొటో తీయించడానికే సమయం సరిపోతోందని, ఇక స్మార్ట్‌కార్డులు ఎప్పుడు పంపిణీ చేయాలంటూ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15నుంచి స్మార్ట్ రైస్ కార్డులను రేషన్‌కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. తొలి రోజు అశోక్‌నగర్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ కార్డులు పంపిణీ చేశారు. ఆ సమయంలో స్థానిక అధికారపార్టీ నాయకులు పాల్గొన్నారు. అదే రోజు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకుల సమక్షంలో స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. అయితే ప్రతి రోజూ స్థానిక నాయకులు ఫొటో కోసం ఎగబడుతున్నట్లు సమాచారం. ఫొటోషూట్ తతంగం ముగియడానికి రోజుకు 3గంటల సమయం పడుతున్నట్లు సమాచారం. దీంతో రైస్ కార్డుల పంపిణీ సక్రమంగా సాగడం లేదని సమాచారం. జిల్లా కేంద్రం, కొన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో ఈ తరహా షో ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. దీంతో డీలర్లు...'బాబు ఒక రోజైతే పర్లేదు ప్రతి రోజూ ఇలాగే చేస్తూ పోతే కార్డులు పంపిణీ చేయలేం...మీకో దండం..మీ ఫొటోకో దండం' అంటున్నారు. వాస్తవానికి ఈనెల 6నే రైస్ కార్డులను పంపిణీ చేయాల్సింది. కానీ ఆలస్యం చేసి 15నుంచి పంపిణీ చేస్తున్నారు.

హక్కుల సాధనే ఐద్వా ధ్యేయం

సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ప్రసూన

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల సాధనే ఐద్వా ధ్యేయమని సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ప్రసూన అన్నారు. అనంతపురం వేదికగా అక్టోబరు 13, 14, 15 తేదీల్లో నిర్వహించే ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకుని నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. 1936లో కృష్ణా జిల్లాలో ఆంధ్ర మహిళా సంఘంగా ఏర్పడి, 1981లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘంగా(ఐద్వా) రూపాంతరం చెందిందని తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఐద్వా ఆవిర్భావం నుంచి కృషి చేస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా రెండు కోట్ల మంది సభ్యులున్న ఐద్వా, మహిళల రక్షణ కోసం పోరాటాల ద్వారా అనేక చట్టాలను సాధించిందని అన్నారు. ఆస్తి హక్కు, వరకట్న వేధింపుల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ, గృహహింస వంటి అనేక చట్టాలను సాధించుకోవడానికి ఐద్వా తోడ్పడిందని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ సాధన కోసం అలుపెరుగని పోరాటం చేశామని అన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు, ఆర్థిక వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ఐద్వా పోరాడుతోందని అన్నారు. అనంతపురంలో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో మహిళలు, విద్యార్థినులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల నేపథ్యంలో అక్టోబరు 9, 10, 11వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని కృష్ణ కళా మందిర్‌లో ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ విశ్వనాథ రెడ్డి, డాక్టర్ పల్లవి, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల కార్యదర్శి నిర్మలమ్మ, ప్రిన్సిపాల్ సరిత, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ మాధవి, ఐద్వా జిల్లా నాయకురాలు గీత, నగర కార్యదర్శి అశ్విని పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రసూన

తొలి వాస్తుశిల్పి విశ్వకర్మ

జయంతి వేడుకలలో ఎంపీ అంబికా



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వంలోనే తొలి వాస్తు శిల్పి విశ్వకర్మ అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి శంఖం ఊది ప్రారంభించారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో సీనియర్ న్యాయవాది గురుప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ శివనారాయణశర్మ, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జేసీ మాట్లాడుతూ విశ్వకర్మను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. చేతి, కులవృత్తుల వారు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ హిందూ సంస్కృతిలో విశ్వకర్మకు ప్రముఖమైన స్థానం ఉందని తెలిపారు. వేడుకల్లో భాగంగా బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులు సంప్రదాయ నృత్యరూపకాలతో అలరించారు. ప్రదర్శనానంతరం విద్యార్థులను ముఖ్యఅతిథులు జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, డీఆర్‌ఓ మలోల, ఆలయ చైర్మన్ మౌళి ఆచారి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ సుభాషిని, డీపీఆర్‌ఓ బాలకొండయ్య, అర్బన్ తహసీల్దార్ హరిప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాస్‌యాదవ్, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

నేడే అమరావతికి పయనం

డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల కోసం 45 బస్సుల ఏర్పాటు



ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఈఓ, ఇతర అధికారులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2025లో ఎంపికైన కొత్త టీచర్లను అమరావతికి తీసుకెళ్తున్నారు. ఏడేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి టీచర్ల నియామకాలను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అన్ని జిల్లాలకు చెందిన టీచర్లు, వారికుటుంబ సభ్యులతో 19న రాష్ట్ర ప్రభుత్వం.. అమరావతిలో సమావేశం ఏర్పాటు చేసింది.ఆ మేరకు జిల్లాలో ఎంపికైన 755 మంది కొత్త టీచర్లు, వారి తరఫున ఒక్కో కుటుంబ సభ్యుడిని అమరావతికి తీసుకెళ్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. జోన్-4 స్థాయిలో జిల్లాకు చెందిన అభ్యర్థులు పీజీటీ, టీజీటీలుగా ఎంపికైన వారితోపాటు కుటుంబ సభ్యులను ఇక్కడి నుంచే అమరావతికి తరలిస్తున్నారు. అందు కోసం 45 బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతిబస్సు పర్యవేక్షణకు నలుగురు లైజనింగ్ అధికారులను నియమించారు. వారికి పర్యవేక్షణపై జిల్లా సైన్స్ సెంటర్‌లో సమావేశం ఏర్పాటుచేసి నిబంధనలను తెలియజేశారు. ప్రత్యేక ఐడీ కార్డులు ఇవ్వనున్నారు. గురువారం ఉదయం 6 గంటలకే పీవీకేకే కాలేజ్‌లో బస్సులు సిద్ధంగా ఉంటాయనీ, అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులతో అక్కడకు చేరుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. అనంతపురం, కర్నూలు మీదుగా ఆత్మకూరు, డోర్నాల, వినుకొండ, నరసరావుపేట, గుంటూరుకు బస్సులు చేరుకుంటాయని డీఈఓ వివరించారు.

సీఎస్ సమీక్ష

మెగా డీఎస్సీ-2025లో ఉద్యోగాలను సాధించినవారిని రాజధానికి పంపేందుకు జిల్లా నుంచి 45 బస్సులు ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఏపీ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, విద్యాశాఖ అధికారులు మొత్తం 2100 మంది వరకు అమరావతికి వస్తారని తెలిపారు. బస్సులు గురువారం ఉదయం బయలుదేరి, సాయంత్రానికి అమరావతికి చేరుకుంటాయని వివరించారు. వీసీలో డీఈఓ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

అవధుల్లేని ఆనందం

టీచర్, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన ఎస్కేయూ విద్యార్థులు

బీఎడ్ కళాశాలలో సంబరాలు



ఉద్యోగాలు సాధించినవారితో వీసీ అనిత, కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ తదితరులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ సెలక్షన్స్, డీఎస్సీలో ఎస్కేయూ బీఎడ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉద్యోగాలు కొల్లగొట్టారు. ఆరుగురు చొప్పున ఎస్జీ టీచర్, కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు. మరికొందరు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి కళాశాలలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఉద్యోగాలు సాధించిన వారి ఆనందానికి అవధుల్లేవు. వారిని వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు అభినందించారు. జ్ఞాపికలను అందజేశారు. యూనివర్సిటీకి, కళాశాలకు మంచి పేరు తెచ్చారని హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సోమశేఖర్ మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు ఇంతమంది ఒకేసారి ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల పర్యవేక్షకుడు లక్ష్మణరావు, అధ్యాపకులు రాజేశ్వరి, శివానంద, భాస్కర్, నారాయణ స్వామి, సుధాకర్, సాల్మన్‌రాజ్, అనిత, సంజీవరాయుడు, శకుంతల పాల్గొన్నారు.

కష్టానికి ఫలితం దక్కింది: తలారి సురేష్



ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో 87.95 మార్కులు సాధించా. ఎస్ఏ ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులో జిల్లా మొదటి ర్యాంకు దక్కింది. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించా. ఇక్కడి వాతావరణం, అధ్యాపకుల బోధనలు ఉద్యోగ సాధనకు ఎంతో ఉపయోగపడ్డాయి. కష్టపడి చదివినందుకు మంచి ఫలితం దక్కింది. ఎంతో సంతోషంగా ఉంది.

ఆరింటిలో అర్హత సాధించా: శ్రీనివాసులు



ఐదేళ్లుగా ఉపాధ్యాయ నోటిఫికేషన్ కోసం ఎదురుచూశా. నోటిఫికేషన్ వెలువడిన తరువాత కష్టపడి చదివా. ఇటీవల డీఎస్సీలో ఆరింటిలో అర్హత సాధించా. ఎస్ఏ మ్యాథమ్యాటిక్స్‌లో రాష్ట్రస్థాయి 19వ ర్యాంకు దక్కింది. జిల్లాలో ఐదో ర్యాంకు వచ్చింది. ఎస్ఏ మ్యాథమ్యాటిక్స్‌తోపాటు ఫిజికల్ సైన్స్, టీజీటీలో మ్యాథమ్యాటిక్స్ ఫిజికల్ సైన్స్‌లో ఉద్యోగానికి అర్హత సాధించా. మ్యాథమ్యాటిక్స్‌పై మక్కువ ఉండడంతో ఎంపిక చేసుకున్నా. గతంలో రైల్వేలో ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు.

అధ్యాపకుల సూచనలు పనికొచ్చాయి: సాయికృష్ణ నాయుడు



డీఎస్సీలో ఎస్ఏ సోషల్‌తోపాటు టీజీటీ ఉద్యోగావకాశం వచ్చింది. కళాశాలలో చదువుకున్నందుకు సంతోషంగా ఉంది. అధ్యాపకుల బోధనలు బాగున్నాయి. వారి సూచనలు ప్రిపరేషన్‌లో చాలా ఉపయోగపడ్డాయి. ఉద్యోగ సాధనకు సహాయపడ్డాయి. నాతోపాటు చదువుకున్న స్నేహితులకు ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉంది.

వసతుల కల్పనకు ప్రాధాన్యం

- సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ



వివరాలు వెల్లడిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురంవిద్య, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ పేర్కొన్నారు. సమగ్రశిక్ష ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి బుధవారం ఆమె విలేకరులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న ప్రతివిద్యార్థికి ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, యూనిఫామ్, బూట్లు, నోటు బుక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 36,66,533 విద్యా కిట్లను అందజేసినట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో రూ.53కోట్లతో వివిధ రకాల సివిల్ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలు, ఎమ్మార్సీలు, కాంప్లెక్స్‌లకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. విద్యాప్రమాణాలు పెంపునకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేజీబీవీల్లో పాల్ కార్యక్రమం ద్వారా పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చి అందులో ఏఐ ద్వారా బోధన చేయిస్తున్నట్లు తెలిపారు. విద్యాశక్తి, విద్యాపథం కార్యక్రమాలు నిర్వహిస్తూ స్పెషల్‌క్లాసులు ఏర్పాటు చేసి, రోజుకొక సబ్జెక్టుకు టెస్టులు పెడుతున్నామన్నారు. పాల్‌కార్యక్రమం అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలోను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఎంశ్రీ స్కూల్స్ జిల్లాలో 42ఉండగా కొత్తగా ఉరవకొండ ఏఆర్ఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్, గుత్తిఏపీమోడల్‌స్కూల్స్‌కు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్ఏ ద్వారా అన్నిపాఠశాలలోను ఒకేషనల్ కోర్సులు ఏర్పాటు చేసి ప్రత్యేక టీచర్లను నియమించి పిల్లలకు నేర్పిస్తామన్నారు. అనంతజిల్లాలోని కేజీబీవీలను ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శంగా నిలపడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఏపీసీ శైలజ తెలిపారు.

నేడు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

కొత్తచెరువు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఉదయం 11గంటల నుంచి గూగుల్ మీట్ ద్వారా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9492843184 నంబరులో సంప్రదించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

విష్ణువర్ధన్ (జయంతి)



కన్నడ సినీరంగంలో 'సాహస సింహ'గా పేరొందిన డాక్టర్ విష్ణువర్ధన్ 1950 సెప్టెంబరు 18న మైసూరు ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు సంపత్ కుమార్. దర్శకుడు పుట్టణ్ణ కణగాల్ రూపొందించిన 'నాగర హావు' సినిమాలో విష్ణువర్ధన్‌గా పరిచయమయ్యారు. కన్నడ, హిందీ, తెలుగు, తమిళ, మళయాళ భాషల్లో 220కుపైగా సినిమాలలో నటించారు. కొన్ని సినిమాలతోపాటు భక్తి ఆల్బమ్స్‌కు పాటలు పాడారు. తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలతో 'అభినవ భార్గవ'గా పేరొందారు. ఏడుసార్లు ఉత్తమ నటుడి అవార్డు, రాజ్యోత్సవ, జీవితసాఫల్యతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు. బెంగళూరు యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. బెంగళూరులోని బనశంకరి దేవాలయం నుంచి కెంగేరి వరకు 14.3 కిలోమీటర్ల పొడవైన రోడ్డుకు గౌరవార్థం ఆయన పేరు పెట్టారు. 2009 డిసెంబరు 30న కన్నుమూశారు.

షబనా అజ్మీ (పుట్టినరోజు)



బాలీవుడ్ సినీనటి, 'పద్మభూషణ్' గ్రహీత షబనా అజ్మీ 1950 సెప్టెంబరు 18న హైదరాబాద్‌లో జన్మించారు. బుల్లితెరపైనా రాణించారు. సినీరంగంలో ఉత్తమ నటిగా ఐదు జాతీయ పురస్కారాలు, ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. సామాజిక కార్యకర్తగా, మహిళా హక్కులనేతగాను గుర్తింపు పొందారు. రచయితగా, స్క్రీన్‌రైటర్‌గా రాణించారు. ఆమె సేవలకుగాను రాష్ట్రపతిచే రాజ్యసభ సభ్యురాలిగా నామినేట్ చేయబడ్డారు. పద్మశ్రీ, గాంధీ ఇంటర్నేషనల్ పీస్ అవార్డు, మార్టిన్ లూథర్‌కింగ్ ప్రొఫెసర్‌షిప్ అవార్డు, పలు యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

ఉపేంద్ర (పుట్టినరోజు)



కన్నడ సినీ నటుడు ఉపేంద్ర 1968 సెప్టెంబరు 18న ఉడుపి జిల్లా కుందాపురలో జన్మించారు. కాశీనాథ్ దర్శకత్వంలో రచయితగా సినీరంగంలోకి అడుగు పెట్టారు. దర్శకుడు, నిర్మాత, స్క్రీన్‌రైటర్‌గాను సత్తా చాటుకున్నారు. కన్నడ, తెలుగు, తమిళ సినిమాలలో నటించారు. విభిన్న సినిమాలు రూపొందించి నటించడం ద్వారా బాక్సాఫీస్ బ్రహ్మగా పేరొందారు. 'ఉత్తమ ప్రజాకీయ పార్టీ'ని స్థాపించి రాజకీయాలలోకి వచ్చారు. అభిమానులచే సూపర్‌స్టార్, రియల్‌స్టార్, 'ఉప్పి' గా పిలబడుతున్నారు. నటి ప్రియాంకను పెళ్లి చేసుకున్నారు.

చోరీ కేసులో 18 నెలలు జైలు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో దొంగతనం చేసిన కేసులో కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గానికి చెందిన మంజప్పగారి సోమశేఖర్ అనే ముద్దాయికి కళ్యాణదుర్గం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 18 నెలలు జైలు శిక్ష విధించినట్లు సీఐ యువరాజు బుధవారం తెలిపారు. 2024 జనవరి 14న కళ్యాణదుర్గం శంకరప్ప తోటలోని ఒక ఇంట్లో సోమశేఖర్ ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అప్పటి సీఐ హరినాథ్ అతన్ని అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేశారు. అనంతరం ఆ చోరీతో సంబంధం ఉన్నట్లు అనుమానంతో సోమశేఖర్ భార్యను ప్రస్తుత సీఐ యువరాజు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీటు వేశారు. విచారించిన ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి భాను నేరం రుజువుకావడంతో సోమశేఖర్‌కు 18 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా అతని భార్యపై నేరం రుజువు కాకపోవడంతో ఆమెకు ఎలాంటి శిక్ష పడలేదు. కేసును ఛేదించిన సీఐ యువరాజు, సీఐ హరినాథ్, కానిస్టేబుల్ విజయ్‌లను ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

ప్రజాదరణ కలిగిన నేత మోదీ

» కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



యలహంకలో కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు స్వాగతం

బెంగళూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో అత్యంత ప్రజాదరణ కల్గిన నేత అని కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ అభిప్రాయపడ్డారు. నగరంలో బుధవారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు కొనసాగాయి. డాలర్స్ కాలనీలోని బీజేపీ నేత యడియూరప్ప నివాసం వద్ద పౌరకార్మికులను సత్కరించారు. రాజాజినగర్ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే సురేశ్‌కుమార్ నేతృత్వంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. భారీ కేక్‌ను పౌరకార్మికులతో కలసి కట్ చేయించారు. ఎంపీ పీసీ మోహన్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రతోపాటు పలువురు కలబురగి గ్రామీణ నియోజకవర్గం దేవనత గనూరు గ్రామంలో భారీ వర్షాలతో పంటనష్టాన్ని పరిశీలించారు. ఇదే సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ దేశం మెచ్చిన ప్రధాని నరేంద్రమోదీ అంటూ కొనియాడారు. యలహంకలో ఎమ్మెల్యే విశ్వనాథ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. జయనగర్‌లో రక్తదాన శిబిరంలో ఎంపీ గోవింద కారజోళ, ప్రతిపక్షనేత అశోక్‌తోపాటు స్థానిక నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



డాలర్స్ కాలనీలో పౌరకార్మికులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న మాజీ సీఎం యడియూరప్ప



జయనగర్‌లో రక్తదాన శిబిరంలో ప్రతిపక్షనేత అశోక్, మాజీ మంత్రి గోవింద కారజోళ తదితరులు

ఇన్నోవేషన్ సెంటర్లతో ఉపాధి మెరుగు

» మంత్రి ఎంబీ పాటిల్



రోల్స్‌రాయిస్ గ్లోబల్ కేపబిలిటీ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి ఎంబీ పాటిల్ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్ సెంటర్ల ద్వారా పరిశోధనలు, ఆవిష్కరణలు సాధ్యం కానున్నాయని తద్వారా ఉపాధి మెరుగు అవుతుందని భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. రోల్స్‌రాయ్స్ కంపెనీ గ్లోబల్ కేపబిలిటీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. భారత్‌లోని బ్రిటీష్ హై కమిషనర్ లిండి కెమరాన్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ హెలెన్ మెకెకేబ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోల్స్‌రాయ్స్ సంస్థ భారత్ ఏరోస్పేస్ రంగంలో అత్యంత పురాతన, మహత్వం, విశ్వాసం కల్గిన భాగస్వామి అన్నారు. హెచ్ఏఎల్‌తో ఇంజన్‌లో ఉత్పాదనారంగంతోపాటు డిజిటల్ ఆవిష్కరణలు, ఇంజనీరింగ్ విభాగంలో రోల్స్ రాయ్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రయోజనం కానుందన్నారు. హెలెన్ మెకెకేబ్ మాట్లాడుతూ ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా భారత్‌తో మా సంబంధం మరింత శక్తివంతం కానుందన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



కాళికా కమటేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలలో భక్తులు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా వ్యాప్తంగా విశ్వకర్మ జయంతి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దొమ్మసంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలోనూ, ముత్తానల్లూరు క్రాస్ హౌసింగ్‌బోర్డులోని కాళికా కమటేశ్వరస్వామి ఆలయంలో విశ్వకర్మజయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. లోకకల్యాణార్థం శాంతిహోమం, యజ్ఞ, యాగాదులు నిర్వహించారు. విశేషపూజల అనంతరం విశ్వకర్మసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నడసోము మాట్లాడుతూ 2016లో రాష్ట్రప్రభుత్వం విశ్వకర్మజయంతికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఆచరిస్తున్నారన్నారు. విధానసౌధ ముందుభాగాన విశ్వకర్మ విగ్రహం, విధానసౌధ వెనుకభాగాన అమరశిల్పి జక్కనాచార్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విశ్వకర్మ సముదాయం డిమాండ్ చేస్తోందన్నారు. పూర్ణాహుతి అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగరాజు, గౌరవాధ్యక్షుడు శంకరాచారి, నారాయణప్ప (మొదలియార్), కాంగ్రెస్ నాయకుడు మాణిక్య, ఉపాధ్యక్షులు ఆనందాచారి, శంకరచారి, కార్యదర్శి రాజణ్ణ, స్థానిక ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సృజనాత్మకతను వ్యక్తం చేసేవి కళలు

» రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కేవీ నాగరాజమూర్తి



డాక్టర్ కేవీ నాగరాజమూర్తి, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సృజనాత్మకతను వ్యక్తం చేసేందుకు కళలు దోహదపడతాయని కర్ణాటక నాటక అకాడమీ అధ్యక్షులు డాక్టర్ కేవీ నాగరాజమూర్తి అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కర్నాటక నాటక అకాడమీ ఆధ్వర్యంలో పౌరానిక గీతగాయన శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పురస్కారాలు పంపిణీ చేసి మాట్లాడారు. సృజనశీల కళలైన సంగీతం, నాటకం, నృత్యం వంటివి మనుష్యులలోని మానవతా గుణాలను పెంపొందిస్తాయన్నారు. కళలకు విద్యావంతులతో నిమిత్తం లేదన్నారు. గ్రామీణ ప్రజలు పౌరాణిక నాటకాలలో పాల్గొని నటించేవారన్నారు. సుగ్గి నుంచి విత్తనాలు వేసేవరకు గ్రామీణులు తమ పల్లెల్లో నాటకాలలో పాల్గొని సంబరపడేవారన్నారు. ఇటువంటి నాటకాలు కులాలు, మతాలకు అతీతంగా ప్రజలు ఆదరిస్తారన్నారు. ఎస్కే కరీం ఖాన్ పాటలు ఎంతో పేరొందాయని గుర్తు చేశారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ బీసీ నాగేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. సంగీతంలో హిందూస్తానీ, కర్ణాటక, జానపదం వంటి కళలు తమదైన ప్రత్యేకత చాటుకున్నాయన్నారు. కళాశాల విద్యార్థులు సైతం శ్రద్ధాసక్తులతో అభ్యసించి తమ ప్రతిభను చాటుకున్నారని ప్రశంసించారు. దేవరాజ్ దర్శకత్వంలో శిబిరాలు సాగాయని కురుక్షేత్ర, సంపూర్ణ రామాయణం, మన్మథ విజయ, దానవీరశూరకర్ణ, శకుంతల తదితర పౌరాణిక నాటకాల గేయాలను ఆలపించారు. కన్నడసంఘం సంచాలకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి తదితరులు పాల్గొన్నారు. వాద్యబృందానికి గోవిందరాజు, గంగరాజు, కాచోహళ్ళి మంజు సహకారం అందించారు.

25 నుంచి హార్టి కనెక్ట్ ఇండియా ప్రదర్శనలు



ప్రదర్శన పోస్టర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహక బృందం

బెంగళూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలో తొలిసారి అంతర్జాతీయ ఉద్యాన ప్రదర్శన సమ్మేళనం హార్టి కనెక్ట్ ఇండియా 2025 ఈనెల 25నుంచి జరగనుంది. తుమకూరు రోడ్డులోని ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మూడు రోజులపాటు ప్రదర్శనలు ఉంటాయి. హార్టి కనెక్ట్ ఇండియా దేశీయ ఉద్యానపంటలు ప్రపంచానికి చేర్చడం అనే నినాదంతో ప్రదర్శనలు చేస్తున్నట్టు ఎక్స్‌పో ఫౌండర్ డైరెక్టర్ ఎస్‌కే గుటగుడియా ప్రకటించారు. ప్రదర్శనలో సూక్ష్మసేద్యం, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, హైడ్రో పోనిక్స్‌తోపాటు పలు ప్రదర్శనలు ఉంటాయన్నారు. హార్టి కనెక్ట్ ఇండియా డైరెక్టర్ శ్రీకాంత్ గొల్లపల్లి, రాజేంద్రకుమార్, రఫీ, భవీన్, రౌనక్ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



బ్రాహ్మణ అభివృద్ధి మండలి అధ్యక్షుడు జయసింహ, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ తదితరులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తలకాయలబెట్ట బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో ఆయా జిల్లాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు బ్రాహ్మణ అభివృద్ధి మండలి అధ్యక్షుడు జయసింహ తెలిపారు. తాలూకాలోని తలకాయలబెట్ట బ్రాహ్మణసంఘానికి 50ఏళ్లు నిండిన నేపథ్యంలో స్థానిక భూనీళా సమేత వెంకటరమణస్వామి ఆలయ ఆవరణలో సువర్ణసంభ్రమ కార్యక్రమం నిర్వహించారు. బ్రాహ్మణసముదాయ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకోసం రూ.12కోట్లు గ్రాంటు ఉందని రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. స్వయం ఉపాధి కోసం కార్పొరేషన్ ద్వారా రూ.2లక్షల రుణం ఇస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.100కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటుకు ఆలోచన ఉందన్నారు. రాష్ట్రంలో 10వేలమంది ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్నవారిని గుర్తించి తలా లక్ష రూపాయలను సేకరించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే 60మంది నుంచి 60లక్షల రూపాయలు సేకరించామన్నారు. నిధుల సేకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వక్త వైవీ గుండూరావు, వందేమాతరం పాఠశాల సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.బీ. హరీశ్, తలకాయలబెట్ట బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు డీఆర్ శంకర్, మాజీ మంత్రి మునియప్ప, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, కాంగ్రెస్ నేత ఆంజినప్ప పుట్టు, కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంప్యూట్ కంట్రోల్‌పై అంతర్జాతీయ సమ్మేళనం

బెంగళూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కంప్యూట్ కంట్రోలర్ నెట్‌వర్క్, ఫోటానిక్స్‌కు సంబంధించి ఐఈఈఈ అంతర్జాతీయ సమ్మేళనం గురువారం నుంచి జరగనుంది. ఆక్స్‌ఫర్డ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే రెండు రోజుల సమ్మేళనానికి స్థానిక సినాప్సిస్ ఐఎన్‌సీ సీనియర్ డైరెక్టర్ వికాస్‌గుడి, ఫ్రాన్సిస్ కో ముర్రె, బిహార్ దార్ యూనివర్సిటీ డాక్టర్ ఫెకద్ మెహ్రత్ గెరెమెవ్‌లు ముఖ్యులుగా పాల్గొననున్నారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఎస్ఎన్‌వీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో జరిగే సదస్సులో ఏఐఎంఎల్, ఐఓటీ, ఆన్‌లైన్ ట్రాక్స్ ఫోటానిక్స్ వంటి అంశాలపై చర్చలు ఉంటాయన్నారు.

విద్యార్థులకు స్కూల్‌బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ 75వ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం నియోజకవర్గం వ్యాప్తంగా 224 ప్రాంతాలలో సమాజ సేవాకార్యక్రమాలు నిర్వహించినట్టు మాజీ మంత్రి అరవింద లింబావళి తెలిపారు. బుధవారం ప్రధాని మోదీ పుట్టినరోజును ఆయన ఆశయాలకు అనుగుణంగా బహిరంగస్థలాలు, పాఠశాలలు, చెరువు ప్రాంతాలు, ఆలయాల ఆవరణ, ప్రభుత్వ ఆసుపత్రులు, అశ్వత్థకట్టలు, బస్టాండ్‌లు, గోశాలలో స్వచ్ఛతా పనులు నిర్వహించారు. గోశాలల్లో గోవులకు మేత అందచేశారు. పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, రాతసామగ్రి పంపిణీ చేశారు. అనాథాశ్రమం, వృద్ధాశ్రమాలలో అన్నదానం చేసి, నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. అక్టోబరు 2వరకు సేవాపక్షోత్సవం నిర్వ హించనున్నట్టు మాజీ మంత్రి లింబావళి తెలిపారు. బీజేపీ హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు హెచ్ఎస్ పిళ్ళప్పలు మాట్లాడుతూ ఎమ్మెల్యే మంజుళా మార్గదర్శకత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా సేవాకార్యక్రమాలు కొనసాగించామన్నారు. కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సువిధమైన సురక్ష..!

- గ్రామీణ ప్రజలకు తపాలా బీమాతో ధీమా
- తక్కువ ప్రీమియం... ఎక్కువ బోనస్
- అందుబాటులో ఆరు రకాల పథకాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం తపాలాశాఖ ఆరు రకాల బీమా పథకాలను అమలు చేస్తోంది. తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌లతో పాలసీదారులకు లాభాల భరోసాను ఇస్తోంది. సురక్ష, సువిధ, సుమంగళ్, సంతోష్, గ్రామప్రియ, చిల్డ్రన్ పాలసీ పేర్లతో ఆరు పథకాలను ప్రవేశపెట్టింది. ఒక్కో పథకం ద్వారా రూ. 10 వేల నుంచి రూ. 10 లక్షల వరకూ పాలసీలు చేసుకునే అవకాశం కల్పించింది. వీటిలో ఒ క్కో పథకానికి బోనస్‌ను రూ.60లు, రూ.48లు, రూ.45లు చొప్పున అందించనుంది. లబ్ధిదారుడు మూడేళ్ల పాటు జరిపిన చెల్లింపులపై రుణ సదుపాయం కల్పిస్తోంది. ప్రీమియం చెల్లిస్తున్న సమయంలో పాలసీదారుడు మరణిస్తే వారు కట్టిన పాలసీ మొత్తాన్ని ఒకేసారి నామినీకి అందజేస్తారు. ఈ పథకాల్లో చేరదలచిన వారు ఆధార్, పాన్‌కార్డు కలిగి ఉండాలి. జిల్లాలోని ఏ పోస్టాఫీసులోనైనా ప్రీమియం చెల్లించవచ్చు. ఆదాయపు పన్ను రాయితీ, నామినేషన్ సౌకర్యం, ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే అవకాశాన్ని తపాలా శాఖ కల్పించింది.



ప్రధాన తపాలా కార్యాలయం

చిల్డ్రన్ పాలసీ : ఈపాలసీలో చేరే పిల్లలకు సంబంధించిన తల్లిదండ్రులు సురక్ష, సువిధ పథకాలలో లబ్ధిదారులై ఉండాలి. ఆయా పథకాల్లో ఉన్న తల్లిదండ్రుల పిల్లలకు మాత్రమే ఈ పథకం వర్తించనుంది. అది కూడా తల్లిదండ్రుల వయస్సు 45 సంవత్సరాలలోపు ఉండాలి. ఈ పథకంలో 5 నుంచి 20 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు పాలసీ వర్తిస్తుంది. ఈ పథకంలో రూ. 20 వేల నుంచి రూ. లక్ష వరకూ పాలసీని నిర్ణయించారు. ఈ పథకంలో బోనస్ రూ. 48లుగా నిర్ణయించారు.

గ్రామప్రియ : ఈ పథకంలో 10 సంవత్సరాల పాలసీ మాత్రమే నిర్ణయించారు. ఇందులో 20 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారిని అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో రూ.45 బోనస్ రూపంలో పాలసీకి వర్తించనుంది. ఈ పథకంలో 10 సంవత్సరాల పాలసీలో మనీబ్యాక్ కింద 4, 7 సంవత్సరాలకొకసారి 20 శాతం బోనస్ లభించనుంది. మిగిలిన మొత్తాన్ని పాలసీ ముగిసే సమయంలో బోనస్‌ను అదనంగా జోడించి అందించనున్నారు.

సువిధ : సువిధ పథకం కింద 10 వేల నుంచి రూ. 10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పాలసీని సురక్ష పథకంలో మాదిరి 60 సంవత్సరాల వరకూ నిర్ణయించుకోవచ్చు. లేదా సంతోష్ పథకంలో నిబంధనల మేరకు కన్వర్ట్ చేసుకునే అవకాశం కల్పించారు. సురక్ష పథకం కింద ప్రీమియం చెల్లింపులు ఐదేళ్ల పాటు చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత ఒక సంవత్సరంలోపు సంతోష్ పథకం కింద కన్వర్ట్ అయ్యే అవకాశం కల్పించారు. సురక్ష పథకం కింద అయితే రూ. 60లు బోనస్... సంతోష్ పథకం కింద కన్వర్ట్ చేసుకుంటే రూ. 48లు బోనస్ లభిస్తుంది. లబ్ధిదారుడి చెల్లింపులు బట్టి బోనస్‌లు వర్తిస్తాయి.

సంతోష్ : సంతోష్ పథకం కింద 10 వేల నుంచి రూ. 10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో బోనస్ కింద రూ. 1000కి రూ.48 వర్తిస్తుంది. ఈ పథకంలో 19 సంవత్సరాల వయస్సు గల లబ్ధిదారుడు పథకంలో చేరితే మెచ్యూరిటీని 35, 40, 45, 50, 55, 58, 60 సంవత్సరాలకు నిర్దేశించుకోవచ్చు. ఇక్కడ మెచ్యూరిటీ ఏ సంవత్సరం వరకూ అయితే నిర్దేశించుకుంటారో... ఆ సంవత్సరం నుంచి మరో ఐదేళ్లపాటు వేచి ఉండాల్సి ఉంటుంది. అనంతరం పాలసీ మొత్తానికి రూ. 48లు బోనస్‌ను అదనంగా జోడించి లబ్ధిదారుడికి అందజేస్తారు. రూ. 10 లక్షలు పాలసీ చేసిన లబ్ధిదారుడికి బోనస్‌తో కలుపుకొని మొత్తం రూ. 29.68 లక్షలు పాలసీ మొత్తం వర్తిస్తుంది.

సురక్ష : సురక్ష పథకం కింద రూ.10 వేల నుంచి రూ. 10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో బోనస్ కింద రూ. 1000కి రూ.60లు వర్తిస్తుంది. 60 సంవత్సరాల వరకూ ప్రీమియం చె ల్లింపులు చేయాల్సి ఉంటుంది. అనంతరం 80 ఏళ్ల తర్వాత రూ. 10 లక్షలు, అందుకు సంబంధించి రూ. 60లు బోనస్‌తో కలిపి మెచ్యూరిటీ మొత్తాన్ని లబ్ధిదారుడికి అందజేస్తారు. లబ్ధిదారుడు మరణిస్తే ఆ మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. రూ. 10 లక్షలు పాలసీ 60 సంవత్సరాల పాటు చెల్లిస్తే బోనస్‌తో కలుపుకొని దాదాపు రూ. 34.60 లక్షలు లబ్ధిదారుడికి అందుతాయి. మూడేళ్ల తర్వాత పాలసీదారుడికి రుణ సదుపాయం కూడా ఉంటుంది.

సుమంగళ్ : ఈ పథకంలో రూ. 10 వేల నుంచి రూ. 10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో రూ. 45లు బోనస్ లభిస్తుంది. పథకంలో రెండు రకాల బోనస్‌లను నిర్ణయించారు. 15 సంవత్సరాల పాలసీను ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీబ్యాక్ కింద 6 సంవత్సరాలకొకసారి, 9 సంవత్సరాలకొకసారి, 12 సంవత్సరాలకొకసారి 20 శాతం మనీ బ్యాక్ రూపంలో బోనస్ లభించనుంది. అనంతరం మిగిలిన బోనస్‌ను పాలసీ గడువు ముగిసిన అనంతరం అందజేస్తారు. 20 సంవత్సరాల పాలసీని ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీ బ్యాక్ కింద 8 సంవత్సరాలు, 12 సంవత్సరాలు, 16 సంవత్సరాలకొకసారి 20 శాతం చొప్పున మనీ బ్యాక్ రూపంలో బోనస్ లభిస్తుంది. ఈ పథకంలో ఎలాంటి రుణసదుపాయం ఉండదు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10.515	11,236
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,208	10,696
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

ఖాళీల భర్తీకి త్వరలో చర్యలు : మంత్రి

రాయచూరు సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కల్యాణ-కర్ణాటక ప్రాంతంలో ఉపాధ్యాయులతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటీల్ అన్నారు. కల్యాణ-కర్ణాటక విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని ఎంజీ స్టేడియంలో జాతీయ జెండాను ఎగరవేసిన అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. కృష్ణా ఎగువ ప్రాజెక్టుల పూర్తి కోసం త్వరలో భూసేకరణకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఆయకట్టు ఎకర భూమికి రూ.70 లక్షలు, మెట్ల పొలాలకు రూ.40 లక్షల మేరకు పరిహారం అందజేసేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు. ఎగువ కృష్ణా ప్రాజెక్టుల కోసం 75 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా దశల వారిగా ఆ భూస్వాధీనానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

అప్రమత్తంగా ఉండండి: ఎస్ఐ

సోమందేపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండటంతో ఆయా కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ సూచించారు. ప్రార్థనా మందిరాల్లో వాచ్‌మెన్, సెక్యూరిటీగార్డ్, పారా వలంటీర్లను నియమించుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విలువైన ఆభరణాలు భక్తులు సమర్పించే కానుకలు, హుండీలో వేసే నగదును కమిటీవారు తమవద్దే ఉంచుకోవాలని, లేనిపక్షంలో బ్యాంకుల్లో పెట్టుకోవాలన్నారు.

కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే

కంప్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో వుండే కట్టడ కార్మికులకు ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని సదుపాయాలు కల్పిస్తామని కంప్లి ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. బుధవారం కంప్లి షుగర్ ఫ్యాక్టరీలోని కోదండరామ ఆలయంలో కట్టడ కార్మికులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తెలిపారు. కట్టడ కార్మికులకు కుటుంబాలకు అన్ని సదుపాయాలు కల్పిస్తాము. వారి పిల్లలకు ప్రత్యేకించి కంప్లి, కురుగోడు తాలుకాలో విద్య వసతి పాఠశాలల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్య భీమా, గుర్తింపు కార్డులు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ సదుపాయాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్టడ రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్ గౌడ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, లక్ష్మన్న బాబు, తిమ్మప్ప, శేఖర్, హరి, మహేష్ గౌడ, ఆదినారాయణ, సురేష్, షుగర్ ఫ్యాక్టరీ ప్రభు క్యాంపు, కంప్లి చుట్టుపక్కల గ్రామాల కట్టడ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ అద్భుత వాస్తు శిల్పి

● ఆయన గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి ● జయంతి వేడుకల్లో ఎంపీ తుకారాం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తుకారాం



ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

బళ్లారి సిటీ/రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేవ శిల్పిగా పేరొందిన విశ్వకర్మ అద్భుత వాస్తు శిల్పి అని ఎంపీ తుకారం అన్నారు. ఆయన గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విశ్వకర్మ నిజమైన మతాన్ని అన్ని జాతులు అనుసరించాలన్నారు. ఆయన గ్రంథాలను అధ్యయనం చేసి ఆయన జీవనశైలి సూత్రాలను పాటిద్దాం సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్య యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకుని విద్యాపరంగా స్పృహ కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగం జీవించే విద్యను పొందే హక్కును ఇచ్చిందని, ప్రతి ఒక్కరూ దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు భవిష్యత్తును ఇస్తారని, అటువంటి ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ రుణపడి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన తన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. విశ్వకర్మ నిజమైన మతాన్ని అన్నిజాతులు అనుసరించాలన్నారు. ఆయన గ్రంథాలను అధ్యయనం చేసి ఆయన జీవనశైలి సూత్రాలను పాటిద్దామన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్య యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకుని విద్యాపరంగా స్పృహ కలిగి ఉండాలన్నారు.

నగరలోని విశ్వకర్మ కమ్యూనిటీ హాస్టల్‌కు రూ.50లక్షలు గ్రాంట్‌గా అందించనున్నట్లు, జిల్లాఆసుపత్రిలో రూ. 12కోట్లతో ఎంఆర్ఐ స్కానింగ్‌కు,ఈఎస్ఐ ఆసుపత్రికి శంకుస్థాపన కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. బళ్లారిలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని , ఇప్పటికే అనేక ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయన్నారు. విశ్వకర్మలు కర్మసూత్రాన్ని ,కృషిని విశ్వసించే వ్యక్తులు సమాజానికి సేవ చేసే దయగల వ్యక్తులు అని ఆయన అన్నారు. ఈసందర్భంగా మహానగర పాలక సంస్థ మేయర్ ముల్లంగినందీశ్, విశ్వకర్మ అభివృద్ధి సంస్థ సభ్యుడు చంద్రశేఖర్, కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, బళ్లారి జిల్లా విశ్వకర్మ వికాస్ వేదిక అధ్యక్షుడు చంద్రకత్ ఎస్.సోనారా, వివిధ సంస్థల ఆఫీస్ బేరర్లు, కమ్యూనిటీ నాయకులు, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంప్లి (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అన్ని కులాలతో పాటు విశ్వకర్మ సమాజకులు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. బుధవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథ్ నాయక, కాలందాశ్రమ మహా స్వాములు రుద్రపాచారి డి మౌనేష్ బట్ట ప్రసాద్ రామచంద్రప్ప, గణేష్, ప్రసాద్, హనుమంతు పాల్గొన్నారు.



కంప్లిలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న విశ్వకర్మ నాయకులు

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి) : సిరుగుప్ప పట్టణం తాలుకా పరిపాలనా బీసీ సంక్షేమ శాఖ, కముటేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు జరిగాయి. డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ విశ్వకర్మ భావచిత్రపటానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడ్లి మల్లికార్జున, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, విశ్వకర్మ సమాజ సభ్యులు శ్రీశైల ఆచారి, సురేష్ ఆచారి, ఈశ్వర్ ఆచారి, నాగరాజు, దేవరాజు,ఉచ్చీరప్ప మహిళలు పాల్గొన్నారు.



సిరిగుప్పలో

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పెనుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల తరలివచ్చారు.



సమన్వయంతోనే కళ్యాణ కర్ణాటక అభివృద్ధి

● విమోచన దినోత్సవంలో మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

రాయచూరు సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటీల్ సూచించారు. బుధవారం నగరంలోని మహాత్మగాంధి స్టేడియంలో ఏర్పాటు చేసిన కల్యాణ కర్ణాటక విమోచన దినోత్సవం సందర్భంగా మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, మంత్రి తన ప్రసంగంలో వివరించారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కలబుర్గి విభాగంలోని ఐదు జిల్లాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. గడచిన 10 ఏళ్లలో వేలాది మంది యువకులు వైద్యులుగా, ఇంజనీయర్లుగా అవకాశాలు అందిపుచ్చుకోవడం 371(జే)తోనే సాధ్యపడిందన్నారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతి ఏటా వార్షిక బడ్జెట్‌లో రూ.5వేల కోట్లను విడుదల చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

బళ్లారి సిటీ (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ఉత్సవంలో భాగంగా సంస్థ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మహాత్మగాంధీ, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలవేసి జాతీయ జెండాను ఎగురవేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం నిజాంల నుండి స్వాతంత్ర్యం పొంది 77 సంవత్సరాలు అయిందని, 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ నిజాం పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది 77 సంవత్సరాలు అయిందన్నారు. ఈసందర్భంగా బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి సీనియర్ ఉపాధ్యక్షుడు మంజునాథ్, గౌరవ కార్యదర్శి సరేశ్‌బాబు,జాయింట్ సెక్రటరీలు మర్చెడ్ మల్లికార్జున గౌడ, వి.రామచంద్ర, సబ్ కమిటీ చైర్మన్లు , కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీశివరాజ్ సెక్రెటరీ గాది లింగప్ప నేతృత్వంలో కళ్యాణ కర్ణాటక విమోచన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు జెండా వందనం చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరేష్, వెంకటేష్, శివకుమార్, అక్కమ్మ,యశోద, రెహానా, రఘు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కంప్లి (ఆంధ్రజ్యోతి) : కంప్లి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం కళ్యాణ కర్ణాటక విమోచన దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మంజునాథనాయక్ మాట్లాడుతూ కళ్యాణ కర్ణాటక ఆవిర్భావ దినోత్సవాన్ని 17 సెప్టెంబరు జరుపుకుంటామని తెలిపారు. కళ్యాణ



మాట్లాడుతున్న మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

కర్ణాటక ఏర్పాటుతో ఎంతో మందికి విముక్తి లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో హేమయ్యస్వామి గ్రేడ్-2 తహసీల్దార్ షణ్ముఖప్ప, జగదీష్, రమేష్, విరుపాక్షి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తోరణగల్లు (ఆంధ్రజ్యోతి) : సండూరు తాలుకా కురేకుప్ప పురసభ ఆవరణలో కళ్యాణ కర్ణాటక విమోచన దినోత్సవం ఇలాగే విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షులు కల్లుడప్ప, సభ్యులు సోమప్ప మాట్లాడారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షులు కల్లుడప్ప సభ్యులు సోమప్ప, పురసభ అధికారులు, సతీష్ గుడ్డే సభ్యులు నాగరాజు,, బసవన్న గౌడ, లక్ష్మీ హోసగేరప్ప, నాగరాజు, ప్రముఖులు నారాయణ, పులికొండ కరీం, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రాజ్ శాఖ ఏఈఈ తిప్పేస్వామి ఆధ్వర్యంలో కళ్యాణ కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు జరిగాయి. బుధవారం సిరుగుప్ప పట్టణంలో పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం ఆవరణంలో కళ్యాణ కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవ జెండాను తిప్పేస్వామి ఎగురవేశారు. ఈ సందర్భంగాతిప్పేస్వామి మాట్లాడుతూ కళ్యాణ కర్ణాటక రాష్ట్ర అవతరణ నేపథ్యంలో ఉత్తరకర్ణాటక ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని తెలిపారు. విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో ఉత్తర కర్ణాటక అభివృద్ధిలో దూసుకెళుతోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు మంజునాథ, రేవణ సిద్దప్ప, శాంతరాజు,వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



తోరణగల్లులో..



పీడీ హళ్లిలో..



కంప్లిలో..



వాణిజ్య పరిశ్రమల మండలిలో జెండా ఎగురవేసిన సంస్థ అధ్యక్షుడు యశ్వంత్ నాగిరెడ్డి

హోసూరు జోన్



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య తదితరులు

ఘనంగా పెరియార్ జయంతి

హోసూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ద్రవిడ ఉద్యమనేత పెరియార్ జయంతిని బుధవారం అర్థవంతంగా ఆచరించారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాల మేరకు కృష్ణగిరి పశ్చిమజిల్లా డీఎంకే కార్యాలయంలో పెరియార్ విగ్రహానికి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. నల్లూరు పంచాయతీ సమతువపురం ప్రాంతంలోని పెరియార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రెండు కార్యక్రమాలలోనూ ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య ముఖ్యులుగా పాల్గొన్నారు. పెరియార్ జయంతిని సామాజిక న్యాయ దినోత్సవంగా ఆచరించేలా ప్రభుత్వం నిర్ణయించడంతో ఆమేరకు సమానత్వ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానికులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో హోసూరు డిప్యూటి మేయర్ ఆనందయ్య, డీఎంకే జిల్లా కోశాధికారి సుకుమారన్, కమిటీ సభ్యుడు ఎల్లో రమణి పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



మురుగన్ ఆలయం వద్ద ప్రసాదం పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

హోసూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని హోసూరులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేశారు. తొలుత మురుగన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కృష్ణగిరి పశ్చిమజిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగరాజ్ నేతృత్వం వహించారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ప్రసాదంగా పొంగలి, వడ, చక్కెరపొంగలిని నైవేద్యం సమర్పించి ప్రజలకు పంపిణీ చేశారు. ఇదే సందర్భంగా అవసరమైన వారికి మెడికల్ కిట్‌లు అందచేశారు. కార్యక్రమంలో మణికంఠన్, శ్రీనివాసన్, మురుగన్, వరలక్ష్మి, మంజుల, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జోళదరాని తిమ్మప్ప

వాల్మీకులను అణగదొక్కుతున్న సీఎం

● నాగేంద్ర, రాజణ్ణను తొలగించడం అన్యాయం
● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాశి తిమ్మప్ప

బళ్లారి సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య వాల్మీకులను అణగదొక్కాలని చూస్తున్నారని, మంత్రి వర్గంలో సమాజానికి కనీస స్థానం లేకుండా పోయిదని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాశి తిమ్మప్ప ఆరోపించారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి వర్గాన్ని అణగదొక్కడమే సీఎం సిద్దరామయ్య ఉద్దేశమన్నారు. దీనికి ప్రధాన ఉదాహరణ వాల్మీకి కుంభకోణమేనన్నారు. దాని ద్వారా మంత్రి నాగేంద్రను మూలన పడేశారు. కేఎన్.రాజన్నను హైకమాండ్‌కు వ్యతిరేకంగా మాట్లాడేలా రెచ్చగొట్టారు. ఆయన తన మంత్రి పదవిని కోల్పోయేలా చేశారు. 15 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఎస్టీ రిజర్వేషన్ నుండి ఎన్నికయ్యారు. దీనిని సహించకుండా కురుబ వర్గాన్ని ఎస్టీలో చేర్చాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కేంద్రం ఇప్పటికే రెండుసార్లు ఎస్టీలో చేర్చమని సూచించినా రాష్ట్ర ప్రభుత్వం చేర్చలేదన్నారు. కురుబ, వాల్మీకి వర్గాల మధ్య వివాదం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈసందర్భంగా వాల్మీకి నాయకుడు జయరామ్, సత్యానారాయణ, ముదిమల్లయ్య రుద్రప్ప, జనార్దన, కృష్ణ, గోవిందప్ప, కేశవ, రాజు,వెంకటేశ్,రూపనగుడి గోవింద్ తదితర సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి

బళ్లారి సిటీ,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా అభిమానులు రక్తదానం నిర్వహించారు. బుధవారం భారతీయ జనతా పార్టీ బళ్లారి నగర యూనిట్ శ్రీరాంపూర్ కాలనీలోని రుక్మిణీబాయి పాండురంగ ఆలయ ప్రాంగణంలో రక్తదాన.ఆరోగ్య తనిఖీ శిబిరాన్ని నిర్వహించారు. శ్రీరాంపుర కాలనీలో డాక్టర్ అరుణ కామేనేని వంద మందికి పైగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్పొరేషన్ సభ్యుడు కే.ఎస్.అశోక్ నేతృత్వంలో జరిగిన రక్తదాన శిబిరంలో మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు గుర్రం వెంకటరమణతో సహా 75మందికి పైగా రక్తదానం చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ దేశ సమగ్ర అభివృద్ధి కోసం పగలు,రాత్రి శ్రమిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దేవుడు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యుడు సోమశేఖర్ రెడ్డి పార్టీ నిధికోసం పార్టీ జిల్లాధ్యక్షుడు అనిల్ నాయుడుకు రూ.1.20లక్షల చెక్కును అందజేశారు. బీజేపీ దిగ్గజాలు గాలి లక్ష్మీఅరుణ, ఎర్రంగళి తిమ్మారెడ్డి, డాక్టర్ మహిపాల్, హనుమంతప్ప, శ్రీనివాస్ మోత్కార్, సరేఖ మల్లనగౌడ, ఎస్.మల్లనగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా వైద్యాధికారి రమేశ్‌బాబు



రికార్డులు పరిశీలిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు, జిల్లా సర్జన్ బసారెడ్డి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహిళలు,పిల్లల ఆరోగ్యం కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డీహెచ్ఓ రమేశ్‌బాబు అన్నారు. ప్రధానమంత్రి మోదీ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 'స్వస్థానీ సశక్తి పరివార్ అభియాన్' ఎనిమిదవ పోషణ్ కార్యక్రమాన్ని ఒకేసారి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈనేపథ్యంలో ప్రధానంగా మహిళలు ,పిల్లల ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స చేయడానికి సేవా సౌకర్యాలను అందించడానికి ఈ ప్రచారం నేపథ్యంలో బుధవారం జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన శిబిరంలో డీహెచ్ఓ రమేశ్‌బాబు, జిల్లాసర్జన్ బసారెడ్డి, ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈసందర్భంగా డీహెచ్ఓ మాట్లాడుతూ స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లాలోని మహిళలు , పిల్లల నిర్దిష్ట ఆరోగ్యం పోషకాహార అవసరాలను తీర్చడానికి ఆయుస్మాన్ మందిరాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు,కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య శిబిరాలను సెప్టెంబరు 17నుండి అక్టోబరు 2వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఆరోగ్య కరమైన జీవనశైలీ,ఆరోగ్య ప్రమాణాలను కాపాడుకోవాలని ఆయన అన్నారు. తినదగిన నూనెలను 10శాతం తగ్గించడం ద్వారా శరీర కొవ్వును తగ్గించాలి. స్థానిక ప్రాంతీయ ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. రుతు పరిశుభ్రత, పోషకాహారం గురించి అవగాహన పెంచాలన్నారు.రక్తదాన శిబిరాలు,నిక్షయ్ మిత్ర వాలంటీర్ రిజిస్ట్రేషన్ ,అవయవ దాన రిజిస్ట్రేషన్లలో పౌరులు చురుకుగా పాల్గొనాలని ఆయన అభ్యర్థించారు. ఈసందర్భంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ , క్షేత్ర ఆరోగ్య విద్య అధికారిణి ఖుర్షీద్ బేగం, వైద్య అధికారులు, జిల్లా ఆసుపత్రి నర్సులు, మహిళలు పాల్గొన్నారు.

మా ఊరిలో కొత్త పరిశ్రమలు వద్దు

కంప్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుడితిని పరిధిలో నూతనంగా పరిశ్రమలు ప్రారంభించ వద్దని సీపీఐఎం పార్టీ నాయకులు బసవరాజు కోరారు. బుధవారం కుడితిని వద్ద జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో జేఎస్‌ఈ ఎలక్ట్రికల్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం కేఐఏడీబీ రైతులు భూముల్లో సుమారు 200 ఎకరాలకు పైగా జిల్లా కలెక్టర్ పరిసర కాలుష్యం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు నిరసన చేపట్టారు. అనంతరం బసవరాజు మాట్లాడుతూ ఇప్పటికే ఆరు గ్రామాల రైతులు పరిశ్రమకు భూములు పోగొట్టుకున్న వారు న్యాయపోరాటం కోసం సుమారు వెయ్యి రోజులకు పైగా కుడితినిలో ఎండనక వాననక నిరసన చేపడుతున్నారన్నారు. మళ్లీ పరిశ్రమలు ప్రారంభించే ప్రయత్నాలు తగవన్నారు. భూములు పోగొట్టుకున్న రైతులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మహమ్మద్ జుబేదార్ రైతులతో మాట్లాడుతూ ఇప్పటికే కార్గో నూతన స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం పత్రికల్లోను ప్రకటన జారీ చేశామన్నారు. స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నూతన పరిశ్రమ ఏర్పాటుపై కూడా తమ గ్రామాల ప్రజలు తెలిపారన్నారు. అంతకుముందు రైతులు తమ సమస్యలు పరిష్కరించిన అనంతరం పరిశ్రమల ఏర్పాటు చేయాలని తెలిపిన విషయంపైన పత్రాల రూపంలో వందల కొద్ది రైతన్నలు అందించారని తెలిపారు. ఇక్కడ జరిగిన సమావేశంలో ప్రజల అభిప్రాయాలు రైతులు అభిప్రాయాలు తమ అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాలుష్య అధికారి సిద్దేశ్వర మురళి శివ శంకర్ రైతు సంఘం నాయకుడు దేవేంద్ర, జంగ్లిసాబ్, ఆనంద్, నరసింహమూర్తి, నాగలింగాచారి, బావి శివకుమార్, సంపత్, తిమ్మప్ప, తిప్పేస్వామి, పంపా పతి, సత్యప్ప, అంజి, రాజశేఖర్, పంపాపతి, వీకేసీ చంద్రప్ప, దొడ్డ బసవయ్య, గ్రామాల రైతన్నలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.